ప్రజాశక్తి
సోమవారం 6 అక్టోబర్ 2025 5
శ్రీ సత్యసాయి



ఒక ఇల్లూ కట్టలేదు..

ఏడాది దాటిన కూటమి పాలన
గృహాల కోసం వేలల్లో దరఖాస్తులు
టిడ్కో గృహాల సంగతేంటి...?



కొటిపి వద్ద పునాదులకే పరిమితమైన పేదల ఇళ్ల నిర్మాణాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయింది. అయినా ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. కనీసం ఇంటి స్థలాలను సైతం కేటాయించలేదు. ఇక 2014-19 మధ్య కాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్మాణం చేసిన టిడ్కో గృహాలను సైతం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో పేదల సొంతింటి కల కలగానే మిగులుతోంది. నిరు పేదలు సొంతింటి కోసం దరఖాస్తులు చేసుకొన్నా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో భూ స్వాధీన పోరాటాలు చేస్తున్నారు. వారు అక్కడ ఏర్పాటు చేసుకున్న నివాసగృహాలకు సైతం పట్టాలు ఇవ్వటం లేదు. దీన్ని బట్టి ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేలకు పేదలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుంది.

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. ఇప్పటి వరకూ సామాన్య ప్రజానీకం సొంతింటి కలకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు వేయని పరిస్థితి. దీంతో ఇంటి నిర్మాణానికి గృహ నిర్మాణ శాఖ వద్ద వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ శ్రీ సత్య సాయి జిల్లాలో సుమారు 22.540, అనంతపురం జిల్లాలో సుమారు 30.800 మంది పేదలు ఇంటి స్థలం, నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈనేపథ్యంలో ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండాపోయింది. దీంతో దరఖాస్తులన్నీ అలానే ఉండిపోయాయి. కొత్త ఇంటి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తే తమ ప్రభుత్వం రూ.2.50 లక్షలు ఇస్తామని చెప్పడం తప్ప ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మంజూరు ప్రక్రియ లేకుండాపోయింది. దీంతో ఎంతోమంది సామాన్య ప్రజానీకం ఇంటి నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి ఉంది. దరఖాస్తు చేసుకుని ఇంకా నిరీక్షించలేక అప్పు తెచ్చి ఇంటి నిర్మాణం చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి సాయం అందుతుందో, లేదో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. గడిచిన పదేళ్ల నుంచి ఇప్పటి వరకూ హిందూపురం పట్టణ సమీపంలోని కొటిపి వద్ద వేసిన లే అవుట్‌లో ఒక్క ఇల్లు నిర్మాణం జరగ లేదు. గత ప్రభుత్వం పునాదులు వేసింది. నిర్మాణం చేపట్టలేదు. 2014-19 మధ్యలో టిడిపి అధికారంలో ఉన్న సమయంలో 2018లో టిడ్కో గృహాల నిర్మాణం కోసం ఎమ్మెల్యే బాలయ్య పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కూడా లబ్దిదారులకు కేటాయించ లేదు.

ఒక్క స్థలమూ ఇవ్వలేదు

గత వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున ఇంటి స్థలాలను పంపిణీ చేసింది. తాము అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు ప్రకటించడంతో పాటు మేనిఫెస్టోలోనూ పెట్టారు. అధికారంలోకొచ్చి 14 నెలలు గడిచినా ఇప్పటి వరకూ ఒక్క స్థలమూ ఇవ్వలేదు. ఇంటి స్థలాలకు సంబంధించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో లెక్కలు కూడా చెప్పడం లేదు. బడా బాబులకు రూ.1 రూపాయికి ఒక ఎకర భూమి కేటాయించడానికి చూపిస్తున్న శ్రద్ధ పేదలకు రెండు సెంట్ల స్థలం కేటాయింపునకు చూపించడం లేదు. భూసేకరణ చేసి ఇంటిస్థలం ఇస్తామని చెబుతూ కాలక్షేపం చేస్తున్నారు. దీంతో ఇంటిస్థలం సామాన్యులకు దక్కుతుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఇళ్ల నిర్మాణం, ఇంటి స్థలాలపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై జనాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

టిడ్కో గృహాల సంగతేంటి....?

హిందూపురం పట్టణంలో గత 17 సంవత్సరాల నుంచి పేదల సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదు.ఉండడానికి సొంతిల్లు లేక పేదలు వేలాది రూపాయాల అద్దె చెల్లించి నివాసం ఉంటున్నారు.2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి కొటిపి వద్ద కేంద్ర ప్రభుత్వ సహాకారంతో టిడ్కో గృహాల నిర్మాణ పనులను 2018 జనవరి 10న ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించారు. ఆ సమయంలో మొదటి దశ కింద 2050 ఇళ్లు, రెండవ దశ కింద 6500 ఇళ్ల నిర్మాణాలను చేపట్టే విధంగా ప్రణాళికలను సిద్ధం చేశారు. అందరికీ ఇళ్లు పథకం కింద టిడ్కో సంస్థ ఆధ్వర్యంలో కేంద్రం, రాష్ట్రం ప్రభుత్వాలు సంయుక్తంగా జీ ప్లస్-3 తరహాలో అపార్టుమెంట్ల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించారు. 300, 365, 430 చదరపు అడుగుల్లో లబ్ధిదారుని వాటాతో ఇళ్లు నిర్మించ తలపెట్టారు. 2736 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు పనులు మొదలు పెట్టారు. ఆ సమయంలో లబ్ధిదారులు ముందుకు రాక పోవడంతో అప్పటి పాలక వర్గం ప్రజలకు అవగాహన కల్పించి డిడిలు చెల్లించే విధంగా చూడడంతో కొంత మంది ముందుకు వచ్చి డిడిలు చెల్లించారు.క్యాటగిరిల వారీగా మొత్తం 2736 మంది డిడిలు చెల్లించారు. ఇందులో 2516 మందికి ఇళ్లను కేటాయించారు. బ్యాంకు లింకేజీ క్రింద లబ్దిదారుల వాటాకు రుణాలను ఇప్పించడానికి మెప్మా వారికి అప్పగించడంతో 380 మందికి వివిధ బ్యాంకుల్లో రుణాలు ఇప్పించారు. అయితే ఇప్పటిదాకా ఇళ్ల నిర్మాణం పూర్తి కాక, లబ్దిదారులకు కేటాయించ లేదు. అయితే బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు మాత్రం ఇఎంఐ చెల్లించాలని కొంత మందికి బ్యాంకు అధికారులు నోటీసులు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే బాలయ్య టిడ్కో గృహాలను సందర్శించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో ఆరు నెలల్లో పనులను పూర్తి చేసి లబ్దిదారులకు అందజేస్తామని ఆ నాడు అన్నారు. అయితే 14 నెలలు పూర్తి అవుతున్నప్పటికి దాని గురించి బాలయ్య కాదు కదా ఆయన పిఎలు సైతం ప్రస్తావించకపోవడం చూస్తుంటే టిడ్కో గృహాల కథ కంచికి చేరినట్లు అనిపిస్తోంది.

శిశుగృహంలో చిన్నారి మృతి

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
సిబ్బంది నిర్లక్ష్యం కారణమంటూ ఆరోపణలు ?
విచారణకు ఆదేశించిన కలెక్టరు ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలోని శిశుగృహంలో నెలల బాలుడు మృతి చెందిన ఘటన కలకలం రేపుతోంది. అక్కడ పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యం మూలంగానే మగ శిశువు మృతి చెందినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై కలెక్టర్ ఆనంద్ సమగ్రమైన విచారణకు త్రిమెన్ కమిటీని వేశారు. దీనికి సంబంధించి పూర్వాపరాలు ఈ విధంగా ఉన్నాయి.. కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఒక మహిళ తనకు పుట్టిన మగబిడ్డ బాగోగులను పేదరికం కారణంతో చూసుకోలేమంటూ ఆగస్టు 30వ తేదీన శిశుగృహంలో వదిలి వెళ్లింది.అప్పటి నుంచి అక్కడే సిబ్బంది పిల్లాడి బాగోగులు చేసుకుంటున్నారు. అయితే అక్కడ పనిచేసే ఆయాలు ఇద్దరు పరస్పరం గొడవ పడి పిల్లావాడు ఏడుస్తున్నా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఎక్కువగా ఏడవటం వలన అనారోగ్యం గురైన ఆ బాలుడు సెప్టెంబర్ 30వ తేదీన మృతిచెందాడు. ఈ విషయం బయటకు పొక్కకుండా బాలుడి మృతదేహాన్ని పూడ్చేసినట్టు సమాచారం. అయితే ఐసిడిఎస్, శిశుగృహం అధికారులు మాత్రం అనారోగ్యంతోనే బాలుడు చనిపోయినట్లు చెబుతున్నారు. ఈవిషయం బయటకు పొక్కడంతో కలెక్టర్ స్పందించారు. వెంటనే విచారణకు త్రీమెన్ కమిటీని వేశారు.

ఆసుపత్రికి తరలించేలోపు బాలుడు మృతిచెందాడు : దీప్తి , శిశుగృహం మేనేజర్

చనిపోయిన మగ శిశువు ఆగస్టు 30వ తేదీన తమ వద్ద వదిలివెళ్లారు. అప్పుడు తక్కువ బరువుతో బాలుడు ఉన్నాడు. 1.75 కిలోలు మాత్రమే ఉండే బాలుడు 2.05 కిలోలు అయ్యాడు. సరిగా చూసుకోకపోవడం వల్లనే బాలుడు మృతిచెందాడన్నది నిజం కాదు. పిల్లాడి ఆరోగ్యం బాగోలేదనిశిశువును అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలోనే చనిపోయడు. గుండె ఆగి చనిపోయినట్లు వైద్యులు చెప్పారు.

ఆరోగ్యం బాగోలేక చనిపోయినట్టు చెప్పారు : నాగమణి , ఐసిడిఎస్ పిడి

శిశువుకు శ్వాస తీసుకోవడం ఇబ్బంది అయి ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు చనిపోయినట్టు తమకు సమాచారం అందింది. శిశువును ఖననం కూడా చేసినట్టు సమాచారమిచ్చారు. అయితే ఇప్పుడు ఆయాలు సరిగా చూసుకోకపోవడం వలన మరణించినట్టు వస్తున్న ఆరోపణలపై విచారిస్తాం.

శిశువు మరణం బాధాకరం.. విచారణకు ఆదేశం : కలెక్టరు ఆనంద్

శిశుగృహంలో రెండు నెలల బాలుడు చనిపోవడం అత్యంత బాధాకరం. ఈ ఘటనపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో విచారణకు ఆదేశిస్తున్నాం. జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి ఈబి.దేవి, ఐసిడిఎస్ పిడి నాగమణి, ప్రభుత్వ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవికుమార్‌లతో కలిపి త్రిసభ్య కమిటీని వేశాం. ఈ కమిటీ శిశుగృహ ఘటనలో పూర్తి స్థాయి విచారణ అనంతరం ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

విచారణ ప్రారంభించిన అధికారులు :అనంతపురంలోని శిశు గృహంలో పసికందు ఆకలితో మృత్యువాత ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాలతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో డిఎంహెచ్ఓ ఈబీదేవి, ఐసిడిఎస్ పీడీ నాగమణి, చిన్నపిల్లల వైద్య నిపుణుడు రవికుమార్‌ను నియమించారు. అయితే చిన్న పిల్లల వైద్య నిపుణుడు విచారణకు రాలేదు. డిఎంహెచ్ఓ ఈబీదేవి, ఐసిడిఎస్ పీడీ నాగమణి విచారణ ప్రారంభించారు. శిశు గృహంలో పనిచేస్తున్న మేనేజర్ దీప్తితోపాటు మరో ఐదుగురి సిబ్బందిని విచారిస్తున్నారు. పసికందు మృత్యువాత పడిన రోజు ఏమి జరిగింది.. ఎవరెవరు విధుల్లో ఉన్నారు.. అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. పూర్తి నివేదికను తయారుచేసి జిల్లా కలెక్టర్ కు అందిస్తామని డిఎంహెచ్, ఐసిడిఎస్ పీడీ తెలిపారు.

భళా గోపాల్‌రెడ్డి...

ఎద్దు కళ్లకు గంతలు కట్టి విత్తనం వేసిన రైతు
9 గంటల్లో 10 ఎకరాల్లో పప్పుశనగ విత్తనం

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మండలకేంద్రానికి చెందిన గోపాల్‌రెడ్డి అనే రైతు ఎద్దు కళ్లకు గంతలు కట్టి 9 గంటల సమయంలో 10 ఎకరాల పొలంలో పప్పుశనగ విత్తనం విత్తాడు. ఈ దృశ్యాన్ని చూసేందుకు ఆత్మకూరు, కూడేరు, కళ్యాణదుర్గం మండలాలకు చెందిన వివిధ గ్రామాల రైతులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ తతంగం సినిమా షూటింగ్‌ను తలపించింది. మండలకేంద్రానికి చెందిన దుబ్బ గోపాల్‌రెడ్డి అనే రైతు తన ఎద్దు కళ్లకు గంతలు కట్టి అదే గ్రామానికి చెందిన పాలెం వెంకటనారాయణరెడ్డి అనే రైతుకు చెందిన నల్లరేగడి భూమిలో పప్పుశనగ విత్తనాన్ని విత్తాడు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 3 గంటల వరకు అంటే 9 గంటల సమయంలో 10 ఎకరాల విస్తీర్ణంలో పప్పుశనగ విత్తనాన్ని విత్తాడు. ఈసందర్భంగా గోపాల్‌రెడ్డిని పలువురు రైతులు అభినందించారు.



ఎద్దు కళ్లకు గంతలు కట్టి విత్తనం వేస్తున్న రైతు

తెలుగుతమ్ముళ్ల ఘర్షణ

- ఇద్దరికి గాయాలు - పాతకక్షలే కారణం
- న్యాయం జరగలేదంటూ ఓ వర్గం రాస్తారోకో

ప్రజాశక్తి- పెనుకొండ

తెలుగు తమ్ముళ్ల మధ్య నెలకొన్న పాత కక్షల నేపథ్యంలో పెనుకొండ మండలం వెంకటగిరి పాళ్యంలో ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాల ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తమకు న్యాయం చేయలేదని ఓ వర్గం వారు 44వ జాతీయ రహదారి పై రాస్తారోకో చేపట్టారు. దీంతో జాతీయ రహదారిపై 3కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనకు సంబందించి బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య తమ్ముడి గోపాల్ కుమారుడు జస్వంత్ యాదవ్ శనివారం సాయంత్రం ఇంటికి వస్తున్న సమయంలో ఓబులేసు మనవడు, మల్లికార్జున కుమారుడు దాడి చేసేందుకు ప్రయత్నించాడని ఈఘటన సిసి టివి పుటేజ్ లో రికార్డు అయిందని బాధితులు చెబుతున్నారు. ఈఘటనపై గోపాల్ ఆదివారం కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి తిరిగి వస్తున్న సమయంలో ఓబులేసు, మంజునాథ్, చంద్ర, శంకర, రవి, గజేంద్ర, చంద్రాయుడు దారిలో కాపుకాచి వేటకొడవళ్ళు, కర్రలతోదాడి చేశారన్నారు. ఈ దాడిలో గోపాల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. మల్లికార్జున్‌కు భుజం, వీపుపై స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున కియా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని 44వజాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. దాదాపుగా గంటకు పైగా నిరసన చేయడంతో జాతీయ రహదారిపై మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిచిపోయాయి. సిఐ రాఘవన్ ఎస్ఐ రాజేష్ ఆందోళనకారులను నచ్చజెప్పి రాస్తారోకోఎను విరమింపజేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో దాడి చేసిన నిందితులకు సంబంధించిన ఇద్దరు అక్కడికి వచ్చారు. దీంతో ఇరు వర్గాలు ఘర్షణకు దిగడంతో ఒక్కసారిగా పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. సిఐ రాఘవన్ ఆధ్వర్యంలో పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం నిందితులను పెనుకొండలో సర్కిల్ కార్యాలయానికి తరలించారు. గాయాల పాలైన గోపాల్, మల్లికార్జున్‌ను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం గోపాల్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం కు తరలించారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పోలీసుల ఎదుటే ఘర్షణకు దిగిన రెండు వర్గాలు

పాతకక్షలతో దాడి : రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య

పాత కక్షలతోనే తమ వారిపై దాడి చేశారని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరక్టర్ కేశవయ్య అన్నారు. దాడికి పాల్పడిన రవి తండ్రి శివయ్య గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద మూడేళ్ళ క్రితం ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురై మృతిచెందాడన్నారు. అయితే శివయ్య రోడ్డు ప్రమాదం లో మరణించలేదని హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించారని వారి కుటుంబ సభ్యులు తనపై ఆరోపణలు చేశారని అన్నారు. వారి వద్ద హత్య చేసినట్లు ఆధారాలుంటే పోలీసులకు ఇవ్వాలని తాము హత్య చేసినట్లు రుజువైతే జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని పోలీసులకు తెలిపినట్లు కేశవయ్య తెలిపారు. మృతిచెందిన శివయ్య కుటుంబ సభ్యులు నిలకడ లేకుండా ఒక్కొక్కరితో ఒక్కో విధంగా తనపై ఆరోపణ చేస్తున్నారని ఆయన అన్నారు. దీన్ని మనసులో పెట్టుకుని తమ కుటుంబ సభ్యులపై దాడి చేశారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా వారి వద్ద ఉన్న ఆధారాలను పోలీసులకు ఇవ్వాలన్నారు. నిరాధార ఆరోపణలు చేసి తన ప్రతిష్ట కు భంగం కలిగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తమను దుర్భాషలాడి దాడి చేశారు : తమ కుటుంబానికి చెందిన ఇద్దరూ శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో గ్రామంలోకి వెళుతున్న సమయంలో కేశవయ్య తమ్ముని కుమారుడు జశ్వంత్ రోడ్డుకు అడ్డుగా కారు ఆపివేశారని నిందితులు తెలిపారు. ద్విచక్ర వాహనం వెళ్లడానికి దారి లేక రోడ్డు పక్కకు తొలగించి వెళ్లే సమయంలో తమపై దుర్భాషలాడారన్నారు. రాత్రి అంతా వారి కుటుంబ సభ్యులు తమను దుర్భాషలాడారని వారు తెలిపారు. ఉదయం పోలీస్ స్టేషన్ కు వచ్చి తిరిగి వెళుతున్న సమయంలో కూడా తమపై దాడి చేశారని వారు ఆరోపించారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 8న సంతకాల సేకరణ

ప్రజాశక్తి-హిందూపురం

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 8వ తేదీన పట్టణంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాజకీయ పార్టీల ఐక్యవేదిక, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌సిపి కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నిర్వహణ చేతకాక మెడికల్ కళాశాలలను ప్రవేట్ వ్యక్తులకు అప్పగించడానికి సిద్ధమైందన్నారు. దీనివల్ల బడుగు, బలహీన, నిరుపేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం కావాల్సి వస్తుందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా మద్దతు కూడగట్టడానికి ఈ నెల 8వ తేదీన సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిపి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు. వైసిపి శంకరయ్య, జై భీమ్ రావు పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఊటుకూరు నాగరాజు. ఆల్ ఇండియా బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు హరికుమార్, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు



సహకార పరపతి సంఘాల జిల్లా అధికారి ఆర్. కృష్ణా నాయక్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని సహకార పరపతి సంఘాల జిల్లా అధికారి ఆర్. కృష్ణానాయక్ తెలిపారు. రైతుల కోసమే ప్రత్యేకంగా ప్రభుత్వం వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఏర్పాటు చేసింది. ఈ సంఘాల ద్వారా రైతులకు అవసరమైన రుణాలు, ప్రాథమికంగా ఆయా గ్రామాలలో అందించాలన్న లక్ష్యంతో ఈ సంఘాల ఏర్పాటుకు అంకురార్పణం జరిగింది. రైతులు ఎన్నుకున్న పాలకవర్గం ద్వారా ఈ సంఘాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా రైతులు పంటలు పెట్టే సమయంలో బయట అధిక వడ్డీలకు రుణాలు తీసుకోకుండా తక్కువ వడ్డీతో రుణాలు తీసుకునే వెసులుబాటు ఈ సంఘాల్లో కల్పించారు. సహకార పరపతి సంఘాలు మరింత బలపడే విధంగా ప్రభుత్వం వినూత్నంగా కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగానే రుణాలతో పాటు అవసరమైన ఎరువులు రైతులకు అందిస్తోంది. ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గాల ద్వారా ఆహార భద్రత కల్పించడానికి అవసరమైన సదుపాయాలు కల్పించడం కోసం ధాన్యం సేకరణ చేపడుతున్నాయి. అలాగే వరి, కందులు ప్రాసెసింగ్ యూనిట్లు ఉమ్మడి వ్యాపారాల స్థాపన ఆయా సంఘాల రైతుల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్) ద్వారా రైతులకు అందుతున్న సదుపాయాల గురించి జిల్లా సహకార పరపతి సంఘాల శాఖ అధికారి ఆర్. కృష్ణా నాయక్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న:- జిల్లాలో ఎన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి? అందులో ఎన్ని సంఘాలలో ఎరువుల పంపిణీ జరుగుతోంది?

జవాబు: జిల్లాలో మొత్తం 54 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఎసిఎస్) ఉన్నాయి. ఎరువుల పంపిణీ కోసం లైసెన్స్ లేని సంఘాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు లైసెన్స్ కోసం దరఖాస్తులు చేయించడం జరుగుతోంది. ఇందులో ఇప్పటివరకు 35 సంఘాలకు లైసెన్సు మంజూరైంది. 29 మంది సిబ్బందికి శిక్షణ ఇప్పించడం జరిగింది. ప్రస్తుతం 15 సంఘాల్లో ఎరువుల పంపిణీ జరిగింది. మరో 20 రోజులలో రబీ సీజన్ కు అవసరమైన ఎరువులు అన్ని ఆయా సంఘాలకు సరఫరా చేయడం జరుగుతుంది.

ప్ర: రైతులకు సంఘాల ద్వారా అందిస్తున్న సేవలు వివరించండి?

జ: ఈ సహకార సంఘాలలో 1.96 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. రైతులందరితో ఈ కేవైసీ చేయించి కంప్యూటరీకరణ చేయిస్తున్నాము. దీంతో రైతులకు ఆన్ లైన్ ద్వారా మెరుగైన సేవలు అందుతాయి. వ్యక్తిగతంగా ఆయా వ్యవసాయ రంగాల అభివృద్ధికి బ్యాంకులు రైతులకు రుణాలు అందిస్తాయి. ఉమ్మడి వ్యాపారాలు చేపట్టే రైతులకు ఉపయోగపడే విధంగా సహకారం అందించడం జరుగుతోంది. ఉమ్మడిగా ఎరువులు అమ్మడం, పాల డైరీ, పాల ఉత్పత్తులు, పాడి పశువులు, ట్రాక్టర్లు, గ్యాస్ కనెక్షన్, పెట్రోల్ బంక్ నిర్వహణ, పచ్చి గడ్డి పెంపకం, తదితర 25 రకాల వ్యాపారాలు నిర్వహించుకొని అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తున్నాము.

ప్ర: రైతులు ఉమ్మడి వ్యాపారాల నిర్వహణకు విధి విధానాలు ఏమిటి?

జ: సహకార సంఘాలలో సభ్యులుగా ఉన్న రైతులు ఉమ్మడిగా రైతులకు సంబంధించిన వ్యాపారాలు చేపట్టవచ్చు. ఈ విధంగా జిల్లాలో ఇప్పటికే 18 సంఘాలు పనిచేస్తున్నాయి. రైతులు రూ.25 లక్షలు పెట్టుబడి పెడితే ప్రభుత్వం మరో 25 లక్షలు సమకూర్చుతుంది. ఇప్పటికే సోమందేపల్లి, బండ్లపల్లి సొసైటీలలో వ్యాపారాలు జరుగుతున్నాయి. వారి వివరాలన్నీ కంప్యూటర్లో నిక్షిప్తమయ్యాయి. త్వరలో మిగిలిన సంఘాలకు కూడా కంప్యూటరీకరణ పూర్తి చేస్తాం. వ్యాపార నిర్వహణలో అవసరమైన శిక్షణ కూడా రైతులకు ఇవ్వడం జరుగుతుంది. రైతులు ఉమ్మడి వ్యాపారాలలో వచ్చే ఆదాయం సమంగా పంచుకోవచ్చు. ప్రభుత్వం అందించే రాయితీని కూడా రైతులు పొందే అవకాశం ఉంది.

ప్ర : ఆహార భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: సహకార సంఘాల ద్వారా రైతులకు యూనిట్ల ద్వారా ఆహార పదార్థాలను నిలువ చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా మన జిల్లాలో గూనిపల్లి, రామగిరి, గోడ్డూరు, కొండూరు, పిఏసిఎస్‌లలో వరి ప్రాసెసింగ్ యూనిట్లు, అలాగే ముదిగుబ్బ, మడకశిర, తదితర సంఘాలలో కందుల ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించడం జరిగింది. అలాగే కొత్త యూనిట్లకు ప్రతిపాదనలు పంపాము. జిల్లాలో 27 ధాన్య నిలువల కోసం గోదాముల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదించాము. 2024-25 సంవత్సరంలో 8 ప్రాథమిక సంఘాల ద్వారా 118.400 మెట్రిక్ టన్నుల రాగి సేకరణ చేయడం జరిగింది. వీటి ధర రూ. 80,82,360 ఉంటుంది. అలాగే రెండు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో 98.9 మెట్రిక్ టన్నుల కందులు సేకరించగా వాటి ధర రూ. 67,11,950 రూపాయలుగా ఉంది.



సహకారపరపతిసంఘాల జిల్లా అధికారి ఆర్. కృష్ణానాయక్

ప్ర : రైతులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

జ: ఉమ్మడిగా రైతులకు ఉపయోగపడే వ్యాపారాలు సంఘాల ద్వారా నిర్వహించుకోవచ్చు. సంఘాలలో ఉన్న రైతులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలి. తద్వారా మరికొన్ని సంఘాలకు రుణ సౌకర్యం కల్పించడానికి అవకాశం ఉంటుంది. మొండి బకాయిల స్థాయికి చేరకుండా సక్రమంగా వ్యాపారాలు నిర్వహించుకుంటే అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. అందుకు రైతులు సహకరించాలి. వ్యాపారాల పర్యవేక్షణ ఆయా సంఘాల అధికారులు చూస్తుంటారు. రైతులకు మేలైన సేవలు అందించడానికి ఈ సంఘాలు ఉన్నాయి.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


జిల్లాలో శాంతి, భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. అందులో భాగంగా రాత్రివేళ గస్తీలు, నైట్ బీట్ చెకింగ్‌లు, పెట్రోలింగ్ నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు చేపట్టారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా పోలీసులు రాత్రివేళ గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజలకు నేరాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని ప్రజలకు సూచించారు. చోరీల నియంత్రణ, మట్కా, గంజాయి, జూదం, బెట్టింగ్, తదితర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టారు. బహిరంగ ప్రదేశల్లో మద్యం తాగడం, ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేశారు. మద్యం తాగి వాహనం నడిపిన చోదకులపై కూడా కేసులు నమోదు చేశారు. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, అర్ధరాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న అపరిచితుల వ్యక్తులను తనిఖీ చేయడంతో పాటు అలాంటి వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. గంజాయి, మద్యం, నాటుసారా, తదితర వస్తువులు అక్రమ రవాణా జరుగకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఎటిఎం కేంద్రాలను చెక్ చేసి భద్రతపై సమీక్షించారు. సైబర్ నేరాలు, పోక్సో కేసులు, బాల్య వివాహాలు, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

వైసిపి సిఇసి సభ్యునిగా నరసేగౌడ్

ప్రజాశక్తి-మడకశిర రూరల్



మాజీ మంత్రి హెచ్‌బి.నరసేగౌడ్‌ను వైసిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(సిఇసి) సభ్యునిగా నియమించినట్లు ఆదివారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యేలు వైటి.ప్రభాకర్‌రెడ్డి, ఎం.తిప్పేస్వామి వైసిపి సిఇసి సభ్యులుగా ఉన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్, నాయకులు

సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన

పాల్గొన్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని గంటాపురం గ్రామంలో ఆదివారం సీతారామచంద్రస్వామి విగ్రహప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రజల సమస్యలు విన్నారు. మంత్రి మాట్లాడుతూ సంప్రదాయ విలువలు, ఆధ్యాత్మిక చైతన్యం సమాజానికి బలాన్నిస్తాయన్నారు. దేవాలయాలు భక్తి, సేవ, సాంస్కృతిక ఏకత్వానికి ప్రతీకలు అన్నారు. ఇలాంటి విగ్రహ ప్రతిష మహోత్సవాలు యువతలో భక్తి భావనను పెంపొందించి సమాజానికి స్ఫూర్తినిస్తాయి అన్నారు. అనంతరం మంత్రి దంపెట్ల గ్రామంలో నిర్వహించిన సీతారాముల ఆలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, వీరనారప్ప, జగ్గు, నాగరాజు, వెంకటపతి, నారాయణస్వామి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాలకై రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల వ్యాప్తంగా పలువురు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. మండలంలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగ, కంది పంట సాగు చేసేవారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్‌లో ఆయా పంటలు సాగు చేసేందుకు అనుగుణంగా రైతులు దుక్కులు చేసి పొలాలను సిద్ధం చేసుకున్నారు. అయితే విత్తనం వేయడానికి అనువైన సమయంలో వర్షాలు కురవకపోవడం, కురిసినా అరకొరగా వర్షపాతం నమోదవడంతో రైతులు వేరు శనగ, కంది పంటలు సాగు చేయలేకపోయారు. దీంతో వ్యవసాయ భూములు బీడుగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం మండలంలో పలువురు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే ప్రభుత్వం ఉచితంగా ఉలవలు, అలసందలు, పెసలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్




విలేకరులతో మాట్లాడుతున్న బంగారు కృష్ణమూర్తి

ఈ నెల 7వ తేదీ వాల్మీకి జయంతిని ప్రతి జిల్లా, నియోజకవర్గం, మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి పిలుపు ఇచ్చారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకి, బోయలు ప్రతి గ్రామంలో రామాయణం పఠణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఆనంద్, రాష్ట్ర అధికార ప్రతినిధి మేకల శివప్రసాద్, రాయలసీమ జిల్లాల అధ్యక్షులు చిన్ననరసింహులు, మహిళా విభాగం రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యదర్శి ప్రమీల, నియోజవర్గ ప్రధాన కార్యదర్శి బాబు పాల్గొన్నారు.

'బత్తల'కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి-కదిరి టౌన్

వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఎస్ఇసి) మెంబర్‌గా నియమితులైన డాక్టర్ బత్తల హరిప్రసాద్‌ను ఆదివారం పలువురు వైసిపి నాయకులు, ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ముందుగా వారు బత్తలకు పూలమల వేసి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం లో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బత్తల హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఈ నెల 7వ తేదీ వాల్మీకి జయంతి సందర్భంగా రూరల్ మండలంలోని పోతులనాగేపల్లి కాలనీలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేసేందుకు రత్నాకర వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో సన్నాహాలు ప్రారంభించారు. అందులో భాగంగా ఆదివారం స్థల దాత మల్లికార్జున ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు నక్కల వెంకటేష్, ధనుంజయ్, విజయ్‌కుమార్, పోతులయ్య, శ్రీనివాసులు, ముత్యాలు, నరసింహులు తదితరులు విగ్రహ ఏర్పాటు స్థలాన్ని శుభ్రం చేశారు. వారు మాట్లాడుతూ వాల్మీకి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం ఏర్పాటు చేస్తామని, వాల్మీకి సామాజిక వర్గం ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరాములు, రాము, కేశవయ్య, జెసిబి లక్ష్మన్న, పుల్లయ్య, లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహం ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

సమస్యల పరిష్కారానికై ఫ్యాప్టో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ ఆదివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఫ్యాప్టో ఛైర్మన్ గజ్జల హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఏ ఒక్క సమస్య తీర్చలేదని, బోధనేతర పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. 4 డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో నూతన సంవత్సరం, సంక్రాంతి, దసరా, దీపావళి పండుగలకు ఉపాధ్యాయులకు ఎదురుచూపులు తప్పడం లేదని విమర్శించారు. రెండేళ్ల పైబడి పిఆర్‌సి కళాతీతమైందని, వెంటనే పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రూ. 25 వేల కోట్ల దీర్ఘకాలిక బకాయిల చెల్లింపులు తక్షణం విడతల వారీగా చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం కారుణ్య నియామకాలు చేపట్టాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు 57 మెమో అమలు చేసి పాత పెన్షన్ విధానం కిందకు తీసుకురావాలని తెలిపారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ గౌస్ లాజం, ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు బడా హరి ప్రసాద్‌రెడ్డి, షమీఉల్లా మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి ఉద్యోగోన్నతులకు మార్గం సుగమం చేయాలని, మున్సిపల్ పాఠశాలలకు అర్బన్ ఎంఇఒ పోస్ట్ మంజూరు చేయాలని, ఎంటిఎస్ ఉపాధ్యాయుల విరమణ వయసు 62 ఏళ్లకు పెంచి , వారి సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 20 డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 7వ తేదీ విజయవాడ కేంద్రంగా ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఉద్యోగ సంఘాలతో చర్చించి విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని లేనిచో ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు. ర్యాలీలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీనివాసులు, తాహెర్‌వలి, రవివర్ధన్‌రెడ్డి, రామానుజులుయాదవ్, లక్ష్మీప్రసాద్, జాఫర్‌హుస్సేన్, ఆదిబయన్న, రాజశేఖర్, రమణారెడ్డి, బి.బాబాఫక్రుద్దీన్, లక్ష్మీపతిరెడ్డి, దివాకర్, రూటాలి అతాఉల్లా, ఎదుల్ల, షర్ఫుద్దీన్, మౌలాలి, రఘునాథ్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న 'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి



కదిరిలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఫ్యాప్టో ధర్నాకు ఎపి ఎస్‌టిఎ మద్దతు

పెనుకొండ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 7వ తేదీ ఫ్యాప్టో చేపట్టిన రాష్ట్రస్థాయి ధర్నాకు స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఎపి ఎస్‌టిఎ) సంపూర్ణ మద్దతు ఇస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి.కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మారుతి ప్రసాద్, పి.జయకృష్ణ, వర్కింగ్ అసోసియేట్ ప్రెసిడెంట్లు సి.నరేష్ కుమార్, మక్కశెట్టి కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన పెండింగ్ బకాయిల చెల్లింపు, మంచి ఫిట్మెంట్‌తో పిఆర్‌సి, మధ్యంతర భృతి, డిఎలు, తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. బోధనేతర కార్యక్రమాల పేరుతో ఉపాధ్యాయులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై ఫ్యాప్టో చేపట్టిన ధర్నాకు తమ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు.

'సాదర' సంఘం ప్రజల అభివృద్ధికి కృషి : ఎంపీ

ప్రజాశక్తి-పరిగి

జిల్లా వ్యాప్తంగా ఉన్న సాదర సామాజిక వర్గం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు సాయం ఎల్లప్పుడూ ఉంటుందని, వారి ఆర్థిక మనుగడకు అన్ని విధాలా కృషి చేస్తానని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. మండలంలోని కొడిగెనహళ్లి సాదర సంక్షేమ సంఘానికి సంబంధించిన స్థలంలో రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేస్తున్న కళ్యాణ మండపం నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. అందులో ఎంపీతో పాటు మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి, సేవామందిర్ స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు కెటి.శ్రీధర్ పాల్గొన్నారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ అన్ని వర్గాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రతి సామాజిక వర్గం అభివృద్ధి చెందేందుకు ఇలాంటి సంక్షేమ భవనాలు ఎంతో అవసరం అన్నారు. ఈ భవనం వల్ల సాదర సామాజిక వర్గానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ భవన నిర్మాణానికి మున్ముందు ఎలాంటి అవసరం వచ్చినా తాను ముందుండి పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో బెంగళూరు సాదర సంఘ అధ్యక్షులు డి.రవికుమార్, హిందూపురం తాలూకా సాదర సమితి అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, టీచర్ లక్ష్మణమూర్తి, నరసింహమూర్తి, ప్రభాకర్, రవి, రఘునాథ్‌రెడ్డి, రఘు, తదితరులు పాల్గొన్నారు.



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

మౌలిక వసతులు కల్పించాలి

కందికుంట నారాయణమ్మ కాలనీలో సిపిఎం నిరసన

ప్రజాశక్తి-కదిరి టౌన్

మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు కందికుంట నారాయణమ్మ కాలనీలో వెంటనే మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం అమీన్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు కాలనీలో పర్యటించారు. వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో సైదాపురం గ్రామ పొలం సర్వే నెంబర్-294లో పట్టణంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే ఉద్దేశం తో రెండు లే అవుట్లు వేశారన్నారు. కాలనీ వాసుల సౌకర్యార్థం మున్సిపల్ అధికారులు నీటి ట్యాంక్ నిర్మాణానికి పునాదులు తీసి 3 అడుగుల మేర పిల్లర్లు వేశారు. ఏ కారణాల చేతనో ఆ తర్వాత నీటి ట్యాంక్ నిర్మాణం ఆగిపోయింది. ఆగిన నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. అమీన్‌నగర్ శాఖ కార్యదర్శి బత్తల సాంబశివ మాట్లాడుతూ శ్రీరామ్‌నగర్, బాబాకాలనీ, న్యూఅమీన్‌నగర్‌లో సుమారు వెయ్యి నివాసాలు ఉన్నాయన్నారు. అయితే మున్సిపాలిటీ వాటర్ పైప్‌లైన్ లేక ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సైదాపురం సర్వే నెంబర్-294లో దాదాపు 300 మంది గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, వారు 4 నెలల నుంచి ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్నా రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం లేదని మండిపడ్డారు. ఇకనైనా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే నీటి ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కందికుంట నారాయణమ్మ కాలనీవాసులు శ్రీనివాసులు, రమేష్, దివాకర్‌నాయక్, మోహన్‌నాయక్, అమ్ములు, గాయత్రి, గంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.

కందికుంట నారాయణమ్మ కాలనీలో పర్యటించిన సిపిఎం నాయకులు





కంటి వైద్యశిబిరం నిర్వహణకు సహకరించిన వారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఐఒఎల్ కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని అధ్యక్షులు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్, క్యాంపు ఛైర్మన్ వైకె.శ్రీనివాసులు తెలిపారు. వారు మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా పేదలకు ఉచిత కంటి వైద్య చికిత్సలు, ఆపరేషన్లు చేయడంతో పాటు కళ్లద్దాలు అందిస్తున్నామని తెలిపారు. శిబిరంలో 82 మందికి కంటి పరీక్షలు చేసి 40 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. కాచర్ల హనుమంతు జ్ఞాపకార్థం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసిన కోనమ్మ, కుమారుడు నటరాజ్, కోడలు సౌభాగ్యను సన్మానించారు. యువర్స్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి బెంగళూరు వారి సహకారంతో శిబిరం నిర్వహించామని తెలిపారు. శిబిరంలో నేత్ర జ్యోతి హాస్పిటల్ డాక్టర్ ఆయూష్, పిఆర్ఒ రాధాకృష్ణ, డాక్టర్ బివి.సుబ్బారావు, కోటేశ్వరరావు, కౌన్సిలర్ కేతా లోకేష్, రామాంజనేయులు, మల్లికార్జున, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రీవెన్స్‌కు జిల్లా అధికారులు అందరూ హాజరై ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అలాగే మండల, డివిజన్, మున్సిపాలిటీ కార్యాలయాల్లో కూడా ఆయా అధికారులు గ్రీవెన్స్ నిర్వహిస్తారన్నారు. అక్కడ పరిష్కారం కాకపోతే కలెక్టరేట్‌కు రావచ్చన్నారు. అర్జీలను ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చు అన్నారు. సమస్య పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్‌లైన్‌లో తెలుస్తుందన్నారు. లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు అన్నారు. జిల్లాస్థాయి అధికారులందరూ గ్రీవెన్స్‌కు హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

అంబేద్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని తక్షణమే కఠినంగా శిక్షించాలని సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేద్కర్ దళితులకే నాయకుడు కాదని అన్ని వర్గాల అభిమాన నాయకుడు అన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించి బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో హక్కులు కల్పించిన మహనేత అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అంబేద్కర్ అంటే గౌరవం ఉందన్నారు. అటువంటి నాయకుని విగ్రహాన్ని ధ్వంసం చేసి అవమానపరచడం దుర్మార్గం అన్నారు. నిందితులపై ప్రభుత్వం వెంటనే కఠినంగా శిక్షించాలన్నారు.

నేడు ఖాద్రీశుని హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీలను సోమవారం ఉదయం 6 గంటల నుంచి లెక్కించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. లెక్కింపు కార్యక్రమానికి హాజరయ్యే దేవస్థానం సిబ్బంది, వ్యక్తులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పురుషులు పంచె, కండువాతో రావాలన్నారు. ఎవరూ వారి సొంత నగదు తీసుకొని హుండీ లెక్కింపు ప్రాంతంలోకి రావద్దన్నారు. అలాగే బంగారం, సెల్‌ఫోన్స్, ఇతర విలువైన వస్తువులు తీసుకు రాకూడదన్నారు. దేవస్థానం సిబ్బంది అందరూ హుండీ లెక్కింపులో తప్పక హాజరు కావాలన్నారు.

'ఎక్కడ పని చేయడానికైనా సిద్ధంగా ఉండాలి'

ప్రజాశక్తి-హిందూపురం

మెగా డిఎస్‌సి ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు ప్రభుత్వం పోస్టింగ్ ఎక్కడికి ఇచ్చిన విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని మానిటరింగ్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. 2025 డిఎస్‌సి ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు రూరల్ మండల పరిధిలోని బిట్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక ఎంఇఒ గంగప్పతో కలిసి మానిటరింగ్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తనఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. భోజన సదుపాయాలు ఇతర సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతు ఉపాధ్యాయులు మారు ప్రాంతాలలో నైనా పని చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. తెలుగు, హిందీ శిక్షణ తరగతులలో భాష నైపుణ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సిఎంఒ మాలిక్, ఎంఇఒలు శేషాచలం, ప్రసన్నలక్ష్మి, భారత విద్యా సొసైటీ ప్రతినిధి డా,, శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఆర్పీలు బాబా, నర్సిరెడ్డి, రాజు, నాగమణి, సిఆర్‌ఎంటిలు, శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

హిందూపురం : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైడ్ ఏ ఫైవ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను మున్సిపల్ ఛైర్మన్ డి ఈ రమేష్ కుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జెవి అనిల్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. పట్టణంలోని ఎంజిఎం క్రీడా మైదానంలో జరిగే ఈ పోటీల్లో జిల్లాలోని ఆరు నియోజక వర్గాల నుంచి వచ్చిన ఫుట్ బాల్ జట్లు పాల్గొంటున్నాయి. క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతు క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని కల్గిస్తాయని అన్నారు. పట్టణంలో క్రీడల అభివద్ధికి తన వంతు సహయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ నాయకులు లోకనాథ్, కిషోర్, శేఖర్, విజయవాడ సలీం తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత

హిందూపురం : పట్టణంలోని కొట్నూరుకు చెందిన సంతోష్ అనే విద్యార్థి పట్టణ సమీపంలో ఉన్నా విద్యానిధి జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్ చదువుతున్నాడు, విద్యార్థి తండ్రి బాలు వికలాంగుడు కావడంతో తగిన ఆర్థిక స్థోమత లేకా ఫీజులు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం వైసిపి సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి దృష్టికి కొంత మంది తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి కళాశాల యాజమాన్యంతో మాట్లాడారు. సంతోష్ ఫీజు తాను చెల్లిస్తానని చెప్పారు. దీంతో పాటు విద్యార్థికి ఆర్థిక సహాయం అందించారు. బాగా చదువుకుని మంచి ఉద్యోగంలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ రెడ్డి, రవికుమార్, అల్లాబకాష్, బాబా పాల్గొన్నారు.



కొడిగెనహళ్లి ఎపిఆర్‌ఎస్ పాఠశాల

'ఎపిఆర్‌ఎస్'లో అమలు కాని మెనూ..!

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని కొడిగెనహళ్లి ఎపిఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో విద్యార్థులకు అందించే భోజనం ఆ పాఠశాల ప్రిన్సిపల్‌కు ఆదాయవనరుగా మారిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థులకు అందించాల్సిన పౌష్టికాహారం విషయంలో ప్రభుత్వం ఇస్తున్న మెనూకు బదులు పాఠశాలలో సొంతం మెనూ అమలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే దసరా సెలవులు ముగియడంతో విద్యార్థులు పాఠశాలకు వచ్చారు. ప్రభుత్వ మెనూ మేరకు వారంలో రెండు సార్లు విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన చికెన్ అందించాలి. అయితే ప్రిన్సిపల్ మత్స్యరాజ్ ఆదివారం విద్యార్థులకు అన్నం పప్పుతోనే సర్ది చికెన్‌కు అయ్యే ఖర్చును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. 'పాఠశాలలో ఇలా జరగడం కొత్తేమీ కాదని పలుమార్లు ఇలాగే జరిగిందని ఆదివారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రిన్సిపల్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లాస్థాయి అధికారులు ఎపి ఆర్‌ఎస్ సొసైటీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. ప్రిన్సిపల్ విద్యార్థుల విషయంలో ఇలా వ్యవహరించడం తగదని మండిపడ్డారు. సరైన భోజనం అందించకపోతే విద్యార్థులు రోగాల పాలయ్యే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజాశక్తితో వాపోయారు.

మంత్రిని కలిసిన ఎస్పీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్




మంత్రికి పూలమొక్క ఇస్తున్న ఎస్పీ

పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఆదివారం నూతన ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా ఎస్పీ మంత్రికి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాలో భద్రతా వ్యవస్థ బలోపేతం, ప్రజలు, పోలీసు శాఖ మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అంశాలపై ఎస్పీతో చర్చించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు వ్యవస్థ ప్రజలకు మరింత చేరువగా ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సామరస్య వాతావరణం నెలకొల్పే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వక ధోరణిలో వ్యవహరించి, న్యాయపరమైన, బాధ్యతాయుతమైన విధానాలతో జిల్లాలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. అదే సమయంలో ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడంలో పోలీసు శాఖ సానుకూల పాత్ర పోషించాలని సూచించారు.

సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న సినీనటుడు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



విజయ్‌కు సత్యసాయి చిత్రపటం అందజేస్తున్న సామకోటి

సినీనటుడు విజయ్ దేవరకొండ ఆదివారం కుటుంబ సమేతంగా పట్టణంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఉదయం విజయ్ కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు నుంచి కారులో బయల్దేరి మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకోగా శాంతి భవన్ వద్ద పోలీస్ అధికారులు, సాయి సేవాదళ్ సభ్యులు స్వాగతం పలికారు. విజయ్ కుటుంబ సభ్యులతో కలిసి సాయంత్రం బాబా సమాధిని దర్శించుకున్నారు. శాంతిభవన్‌లో విజయ్‌ను టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మర్యాద పూర్వకంగా కలిసి సత్యసాయి చిత్రపటాన్ని అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని సిఐ నారాయణరెడ్డి హెచ్చరించారు. సిఐ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు పట్టణంలోని ప్రధాన కూడళ్లు అయిన జీవిమాను సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, చౌక్ సర్కిల్, హిందూపురం క్రాస్, వేమారెడ్డి క్రాస్ వద్ద ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి జరిమానా విధించారు. మరోసారి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

మహిళా హోంగార్డు ఆత్మహత్యాయత్నం

గోరంట్ల : పట్టణంలో స్థానిక పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న మహిళా హోంగార్డు ప్రియాంక ఆదివారం పట్టణానికి సమీపాన కూల్ డ్రింక్‌లో సూపర్ పాస్మైల్ కలుపుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన బంధువులు ప్రియాంకను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయంపై బాధితురాలు హోంగార్డు ప్రియాంక మాట్లాడుతూ తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి కారు డ్రైవర్లు షఫీ, మైను అనే ఇద్దరు వ్యక్తులని చెప్పారు. తనను వేధిస్తున్న వీరు తనపై సిఐ శేఖర్ కు లేనిపోని అబద్ధాలు చెప్పారన్నారు. వారి మాటలు నమ్మిన అధికారులు పోలీస్ కోటర్స్‌లో నివాసమున్న తనను ఖాళీ చేయమని ఆదేశించారన్నారు. దీనికి మనస్థాపానికి గురై ఆత్మయత్నానికి పాల్పడినట్లు బాధితురాలు తెలిపారు. ప్రియాంకను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. తన ఆత్మహత్యాయత్నానికి కారణం ఆ ఇద్దరు డ్రైవర్లే అని ప్రియాంక తన సెల్ఫీ వీడియోలో వాంగ్మూలం ఇచ్చింది.

రైలు కింద పడి ఇద్దరు వ్యక్తులు మృతి

నల్లచెరువు : స్థానిక రైల్వేస్టేషన్‌కు సమీపంలో 73/02 కి.మీ వద్ద సుమారు 40 ఏళ్ల పురుషుడు, మండలంలోని దేవరంటిపల్లి సమీపంలో గుర్తు తెలియని ఓ మహిళ రైలు కింద పడి మృతి చెందారు. వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రైలు కింద పడిన పురుషుడుని కొద్ది దూరం లాక్కెళ్లడంతో ముక్కలు ముక్కలై మృతదేహం గుర్తించటానికి వీలు కాకుండా ఉంది. అతడి ఎడమ చేతి భుజంపై అరుణ, రేవతి అని (తెలుగులో) పచ్చబొట్టు ఉంది. అతడిని సమీప చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. మృతదేహం కదిరి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదిలో ఉంది. వివరాలు తెలిస్తే కదిరి రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సి.బాలకృష్ణ శర్వాణి-89190 90782, ఎస్.మహబూబ్‌బాషా 91331 09537 లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

లీకేజీ నీటితో పాచిపట్టిన రోడ్డు

రొద్దం : పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో మండలంలోని ఆర్.మరవపల్లి గ్రామ సమీపంలో కల్వర్ట్ వద్ద పైప్‌లైన్ పగిలిపోయి నీరు వృథా అవుతోంది. ఆ నీరు నిరంతరం సీసీ రోడ్డుపైకి చేరడంతో పాచి పట్టింది. దీంతో రాకపోకలు సాగించే క్రమంలో జారి పడే ప్రమాదం ఉందని ద్విచక్ర వాహనదారులు పేర్కొంటున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టడంతో పాటు ద్విచక్ర వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.



పైపులైన్ పగిలిపోవడంతో వృథా అవుతున్న నీరు